# నిన్ను నియమించితిని

“ గర్భములో నేను నిన్ను రూపింపక మునుపే నిన్నెరిగితిని, నీవు గర్భము నుండి బయలుపడక మునుపే నేను నిన్ను ప్రతిష్ఠించితిని, జనములకు ప్రవక్తగా నిన్ను నియమించితిని”. యిర్మీయా 1:5

## ఉపోద్ఘాతం

తన ప్రజల్లో ప్రతి ఒక్కరికీ తగిన స్థలాన్నీ, పనినీ దేవుడు నిర్ణయించాడు. మనం ఏమి చేసినా దేవుడు మనలను ఆ పనికి నియమించాడన్నది గ్రహించి చెయ్యాలి. మనం ఉనికిలోకి రాకముందే మన విషయమంతా దేవునికి తెలుసు. యిర్మీయా విషయంలో దేవునికి చాలా ఉన్నతమైన ఉద్దేశం ఉంది. అతడు కేవలం ఇశ్రాయేలు వారికి మాత్రమే కాదు, లోకం లోని సమస్త జాతులకు కూడా ప్రవక్తే. సేవకులైన వారిని దేవుడే నియమించినాడు. అయితే ఈ సంగతిని మరచిన చాలా మంది సేవకులు అలా దేవుని సేవలో నిరుత్సాహపడతారు. కారణం సాతాను యొక్క దాడి. సేవకులపై దాడులు, వారికి విరుద్ధంగా నిషేధాలు, అల్లరిమూకల దౌర్జన్యం, చెరసాలలు, 'కుల కట్టడల వలన కీడు కల్పించడం' వంటివి ఉన్నాయి. (కీర్తన 94:20) అయితే సాతాను ఎంత తీవ్రంగా ప్రయత్నించినా అతడు ఓడిపోతూనే ఉంటాడు, "మన దేవుడు గెలుస్తూనే ఉంటాడు!" మొదట్లో యిర్మీయా కూడా అలాగే నిరుత్సాహపడ్డాడు. అయితే ఆయన ఇతరుల మాటలను బట్టి లేదా వారు చేసిన పనులను బట్టి దేవుని సేవ చేయడం ఆపలేదు. ( “ఆయన పేరు నేనెత్తను, ఆయన నామమును బట్టి ప్రకటింపను, అని నేనను కొంటినా?”. యిర్మీయా 20:9); యిర్మీయా ఎన్నో శ్రమలను తన జీవితంలో ఎదురు వచ్చినా ఆయన దేవుని సేవ చేయడం మాత్రం ఆపలేదు. సేవ ఆపకూడదని యిర్మీయా ఎందుకు అనుకున్నాడో ఇప్పుడు మనం చూద్దాం.

## 1. సేవకులను దేవుడు ముందుగానే నియమించి యున్నాడు

“గర్భములో నేను నిన్ను రూపింపక మునుపే నిన్నెరిగితిని, నీవు గర్భము నుండి బయలుపడక మునుపే నేను నిన్ను ప్రతిష్ఠించితిని, జనములకు ప్రవక్తగా నిన్ను నియమించితిని.” యిర్మీయా 1:5; ప్రభువు యిర్మీయా పుట్టక ముందే ఆయనను తన ప్రవక్తగా ఎన్నుకున్నాడు. ఎందుకొరకు దేవుడు యిర్మీయాను నియమించినాడు? యిర్మీయా ద్వారా దేవుడు పంపిన ప్రవచనమే జనాల మధ్య, రాజ్యాల మధ్య ఈ సంగతులను జరిగిస్తుంది. దేవుని ఆత్మ ద్వారా యిర్మీయా పలికిన వాక్యం రెండు విధాలైన ఫలితాలను సాధిస్తాయి. వాటిలో నాశనం చేసే శక్తి ఉంది, నిర్మించే శక్తి ఉంది.

దేవుని వాక్కును వినేవారి స్థితిని బట్టి, దానికి వారు చూపే వైఖరిని బట్టి ఈ రెండు ఫలితాల్లో ఏదో ఒక రకమైన ఫలితం తప్పక ఉండి తీరుతుంది. కొన్నిసార్లు మంచితనం వర్ధిల్లాలంటే చెడుతనాన్ని నాశనం చేయక తప్పదు.

“ పెల్లగించుటకును విరుగ గొట్టుటకును, నశింప జేయుటకును పడద్రోయుటకును, కట్టుటకును నాటుటకును నేను ఈ దినమున జనముల మీదను రాజ్య ముల మీదను నిన్ను నియమించి యున్నాను.” యిర్మీయా 1:10

## 2. సేవకులకు దేవుడు తోడుగా ఉన్నాడు

“వారికి భయపడకుము, నిన్ను విడిపించుటకు నేను నీకు తోడై యున్నాను, ఇదే యెహోవా వాక్కు” యిర్మీయా 1:8;

దేవుడు యిర్మీయాను సేవకునిగా నియమించిన తరువాత కొన్ని సంవత్సరాల తర్వాత పరిస్థితులకు భయపడిన యిర్మీయా ఆ తర్వాత సేవలో నిరుత్సాహ పడ్డాడు. ఎందుకంటే దేవుని సేవ చేస్తున్నందుకు ప్రజలు ఆయనను ఎగతాళి చేశారు. 'నేను దినమంతా నవ్వుల పాలయ్యాను. అందరూ నన్ను ఎగతాళి చేస్తున్నారు' అని అన్నాడు. అందుకే దేవుని సేవ చేయడం ఆపేయాలని నిర్ణయించుకున్నాడు. “యెహోవా పేరు నేనెత్తను, ఆయన నామాన్ని బట్టి ప్రకటించను”. యిర్మీయా 20:9; అని అన్నాడు. అయితే ఆయన దేవుని సేవ చేయడం నిజంగానే ఆపేశాడా?

యెహోవాతో 'నేను బాలుడను; మాట్లాడడానికి నాకు శక్తి చాలదు.' అన్నాడు. దానికి యెహోవా యిర్మీయాతో సౌమ్యంగానే అయినా.. గట్టిగా...యిర్మీయాతో ఇలా అన్నాడు: "నేను బాలుడనని అనవద్దు; నేను నిన్ను పంపేవారి దగ్గరకు నీవు పోవాలి, నీకు ఆజ్ఞాపించిన సంగతులన్నీ చెప్పాలి. వారికి భయపడ వద్దు." ఎందుకు భయపడ కూడదు? ఎందుకంటే, 'నిన్ను విడిపించడానికి నేను నీకు తోడుగా ఉన్నాను అని యెహోవా చెప్పాడు.

## 3. యిర్మీయా హృదయంలో అగ్నిలా మండుతూ ఉన్న వాక్యం

"అది నా హృదయంలో అగ్నిలా మండుతూ, నా యెముకల్లోనే మూయబడి నట్లుంది, నేను ఓర్చి ఓర్చి విసికిపోయాను"; . యిర్మీయా 20:7-9; అని యిర్మీయా అన్నాడు. “ఆయన సేవకులు అగ్ని జ్వాలల వంటివారు. వాయువులను తనకు దూతలుగాను అగ్నిజ్వాలలను తనకు పరిచారకులుగాను ఆయన చేసి కొనియున్నాడు.” కీర్తన 104:4; అగ్నిజ్వాలల వంటి సేవకులను ఆయన తనకు పరిచారకులుగా చేసుకొన్నట్లు కీర్తనాకారుడు చెప్పుచున్నాడు. ఒక సందర్భంలో యేసు తన శిష్యులతో ఇలా అన్నాడు: "నేను భూమిమీద అగ్ని వేయ వచ్చితిని.” లూకా 12:49; నిజంగానే ఆయన అగ్ని రగిలించాడు. ప్రభువు అందించిన అగ్నిచేత రగిలించబడిన సేవకులు 'కట్టెల క్రింది నిప్పులుగా పనల క్రింది దివిటీలుగా' అగ్నిని అనేకులలో రగిలిస్తూ ఉన్నారు. భయంకరమైన శ్రమల మధ్య అనేకులకు బాప్తిస్మమిచ్చిన యోహాను మండుచున్న దీపమై ప్రకాశించాడు. “అతడు మండుచు ప్రకాశించుచున్న దీపమైయుండెను.” యోహాను 5:35.

## 4. యిర్మీయా మరణానికి పాత్రుడు కాడు

ధైర్యంగల సేవకులకు దేవుని కాపుదల ఎప్పుడూ ఉంటుంది. యిర్మీయా కొన్నిసార్లు భయపడ్డా, దేవుని మీదున్న ప్రేమవల్ల ఆయన దేవుని సేవ చేయడం ఆపలేదు. దేవుని సేవ చేయడం ఆపనందుకు యిర్మీయా ఎలా కాపాడబడ్డాడో చూద్దాం....... ప్రజలు తమ చెడు ప్రవర్తన మార్చుకోకపోతే, యెరూషలేము నాశనం చేయబడుతుందని వారిని హెచ్చరించడానికి యెహోవా యిర్మీయాను పంపించాడు. యిర్మీయా ప్రజల్ని హెచ్చరించినప్పుడు వాళ్లు కోపంతో, 'ఇతను మరణానికి పాత్రుడు' అని అరిచారు. కానీ యిర్మీయా 'మీరు యెహోవా మాట వినండి' అని వారిని అర్థించాడు. ఆ తర్వాత ఆయన వారితో, 'యెహోవా మీ యొద్దకు నన్ను పంపించాడు గనుక, మీరు నన్ను చంపితే, నిరపరాధిని

చంపినట్లే' అన్నాడు. అప్పుడు ఏమి జరిగింది? వాక్యం ఇలా చెబుతోంది - అధిపతులు, జనులందరు యాజకులతో, ప్రవక్తలతో ఇలా అన్నారు "ఈ మనుష్యుడు మన దేవుడైన యెహోవా నామాన్నిబట్టి మనకు ఈ సమాచారం ప్రకటిస్తున్నాడు గనుక ఇతడు మరణానికి పాత్రుడు కాడు." యిర్మీయా 26:16; యిర్మీయా భయపడి తాను చేస్తున్న పనిని ఆపలేదు కాబట్టి యెహోవా ఆయనను కాపాడాడు. దేవుడు తన సేవకులతో ఇలా మాట్లాడు చున్నాడు. "భయపడకుము. పేరుపెట్టి నిన్ను పిలిచి యున్నాను. నీవు నా సొత్తు. నీవు జలములలోబడి దాటునప్పుడు నేను నీకు తోడైయుందును; నదులలో బడి వెళ్లునప్పుడు అవి నీమీద పొర్లిపారవు. నీవు అగ్ని మధ్యను నడచు నప్పుడు కాలిపోవు, జ్వాలలు నిన్ను కాల్చవు. యెహోవానగు నేను నీకు దేవుడను, ఇశ్రాయేలు పరిశుద్ధదేవుడనైన నేనే నిన్ను రక్షించువాడను".యెషయా 43:1-3

## 5. భయపడే సేవకులకు దేవుని కాపుదల ఉండదు

యిర్మీయా ఎన్ని సమస్యలు వచ్చిన ధైర్యంగా దేవుని సేవ కొనసాగించాడు. దేవుని సేవ చేయడం ఆపనందుకు యిర్మీయా ఎంతో అద్భుతంగా కాపాడబడ్డాడు. కానీ మరో ప్రవక్త భయంతో దేవుని సేవ చేయడం ఆపేశాడు. ఆయన పేరు ఊరియా. ఆయనకు ఏమి జరిగిందో మనమిప్పుడు చూద్దాం. యిర్మీయా చెప్పిన మాటల రీతిని యెరూషలేముకు విరోధంగా ప్రవచించాడు' అని బైబిలు చెబుతోంది. అయితే రాజైన యెహోయాకీము ఊరియాపై మండిపడ్డాడు, అప్పుడు ఊరియా ఏంచేశాడో మీకు తెలుసా? భయపడి దేవుని పని ఆపుజేసి ఐగుప్తుకు పారిపోయాడు. ఊరియాను బంధించి తీసుకువచ్చేందుకు రాజు మనుషులను పంపించాడు. వారలా ఊరియాను బంధించి తీసుకొచ్చినప్పుడు రాజు ఊరియాను ఖడ్గముతో చంపించాడు. యిర్మీయా 26:23; యెహోవా యిర్మీయాను ఎందుకు కాపాడాడు, ఊరియాను ఎందుకు కాపాడలేదు? యిర్మీయా కూడా ఊరియాలాగే భయపడి ఉండవచ్చు, కానీ ఆయన యెహోవా సేవ చేయడం ఆపేసి పారిపోలేదు. ఆయన తాను చేస్తున్న పనిని ఆపేయలేదు.

## 6. సేవకులు పర్వతములను పిండి చేయువారు

దేవుడు తన సేవకులను ఇలా బలపర్చుచున్నాడు. "కక్కులు పెట్టబడి పదునుగల కొత్తదైన నురిపిడిమ్రానుగా నిన్ను నియమించి యున్నాను. నీవు పర్వతములను నూర్చుదువు వాటిని పొడి చేయుదువు, కొండలను పొట్టువలె చేయుదువు, నీవు వాటిని గాలించగా గాలి వాటిని కొని పోవును, సుడిగాలి వాటిని చెదరగొట్టును."

యెషయా 41:15,16; ఆధ్యాత్మిక భావంలో, పర్వతము వంటి తన శత్రువులను లోబరచుకోవడానికి సేవకులకు శక్తి ఇవ్వబడుతుంది. యేసు సేవకులకు ఇలా వాగ్దానం చేస్తున్నాడు: "నేను నా తండ్రివలన అధికారము పొందినట్లు జయించుచు, అంతము వరకు నా క్రియలు జాగ్రత్తగా చేయువానికి జనులమీద అధికారముఇచ్చెదను. అతడు ఇనుప దండముతో వారిని ఏలును; వారు కుమ్మరవాని పాత్రలవలె పగులగొట్టబడుదురు." ప్రకటన 2:26, 27.

## 7. తన మాట చొప్పున దేవుడు సేవకులకు మేలు చేయువాడు

దేవుడు సేవకులకు మేలుచేయువాడని ఎంతో అద్భుతమైన దేవుని వాగ్దానం ఉన్నది. సేవకులైన వారు ఆ వాగ్దానాన్ని నమ్మి లోబడాలి. “యెహోవా, నీ మాట చొప్పున నీ సేవకునికి నీవు మేలు చేసియున్నావు.” కీర్తన 119:65

యిర్మీయా వృత్తాంతం నుండి సేవకులైనవారు ఏమి నేర్చుకోవచ్చు? దేవుడు చెప్పింది చేయడం కొన్నిసార్లు మనకు కష్టం అనిపించవచ్చు, అయినా దేవుడు మనకు మేలు చేయువాడని, మనం ఎల్లప్పుడూ దేవునిపై నమ్మకముంచి ఆయనకు లోబడాలని వాక్యం చేపుచున్నది. అప్పుడాయన సేవకులను ఘనంగా వాడుకొనగలడు. వారి "పాదాలను సుందరంగా" చేసి సమాధాన సువార్త వలననైన సిద్ధమనస్సను పాదరక్షలను ధరింపజేసి అద్భుతమైన విజయాలను వారికి ఇవ్వగలడు. "సువార్త ప్రకటించుచు సమాధానము చాటించుచు సువర్తమానము ప్రకటించుచు రక్షణ సమాచారము ప్రచురించువాని పాదములు, పర్వతములమీద ఎంతో సుందరములై యున్నవి.”యెషయా 52:7.

## ముగింపు

సేవకులు దేవుని నూతన సృష్టి. భూమిపై ఆధ్యాత్మికమైన వెలుగును ఇచ్చేందుకు సృష్టించబడ్డారు. క్రీస్తు ఈ లోకంలో ఉన్నప్పుడు అలాంటి వెలుగుగా ఉన్నాడు (యోహాను 8:12; 9:5). ఇప్పుడు ఆయనను అనుసరించే సేవకులు “వెలుగు సంతానం”, ఆయన వెలుగును ప్రతిబింబించవలసిన వారు. కనుక ప్రియ దేవుని జతపనివారలారా! కట్టెల క్రింది నిప్పులుగా పనల క్రింది దివిటీలుగా ఉన్న సేవకులైన మీరు పర్వతములను పిండి చేయువారు. కనుక దేవుడు మీకు అనుగ్రహించిన వాగ్దానంయందు నమ్మకముంచి విశ్వాసంతో ముందుకు నడిచిన యెడల దేవుడు మిమ్ములను యిర్మీయా వలే యోహానువలే మండుచున్న అగ్నిజ్వాలలవలే చేయగలడు. అట్టి కృపను మీకు సమృద్ధిగా దేవుడు అనుగ్రహించును గాక! ఆమేన్!!